సాక్షి తిరుపతి
శుక్రవారం । 29 । ఆగస్టు । 2025



నేత్రదానానికి ముందుకు రావాలి

నేత్రదానం చేయడానికి ప్రజలు పెద్ద ఎత్తున ముందుకు రావాలని జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్ పేర్కొన్నారు. - 8లో



క్వాంటమ్ టెక్నాలజీదే భవిష్యత్తు

క్వాంటమ్ టెక్నాలజీ భవిష్యత్తులో కీలక భూమిక పోషిస్తుందని పద్మావతి వర్సిటీ వీసీ తెలిపారు. - 8లో



యువకుడి దారుణ హత్య

వెంకటగిరి రూరల్ మండలం అమ్మపాళెం గ్రామానికి చెందిన యువకుడు దారుణ హత్యకు గురయ్యాడు. - 8లో

న్యూస్‌రీల్

నవోదయ దరఖాస్తుల్లో మార్పునకు అవకాశం

తిరుపతి సిటీ : ఉమ్మడి చిత్తూరు జిల్లా ప్రస్తుత అన్నమయ్య జిల్లా వలసపల్లి జవహర్ నవోదయ విద్యాలయంలో 2026–27 విద్యా సంవత్సరానికి 6వ తరగతి ప్రవేశానికి జరగనున్న ఎంపిక పరీక్ష దరఖాస్తుల ప్రక్రియ గురువారంతో ముగిసింది. ఇప్పటికే ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకున్న విద్యార్థులు తాము చేసుకున్న దరఖాస్తులు కులం, చిరునామా, ధ్రువపత్రాల విషయంలో ఎటువంటి అభ్యంతరాలు ఉన్నా తప్పులను సరిచేసుకునేందుకు 30వ తేదీ వరకు అవకాశం ఇస్తున్నట్లు ప్రిన్సిపల్ గీతా ఒక ప్రకటనలో తెలిపారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు, తల్లిదండ్రులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

నేత్రదానంతో మరొకరికి కొత్త జీవితం



హెల్ప్‌లైన్ నంబర్‌ను విడుదల చేస్తున్న ఈఓ శ్యామలరావు

తిరుపతి తుడా : శ్రీవారి భక్తులు, ప్రజలు స్వచ్ఛందంగా నేత్రదానం చేసి ఎంతో మందికి కొత్త జీవితాన్ని అందించాలని టీటీడీ ఈఓ శ్యామలారావు పిలుపునిచ్చారు. జాతీయ అంధత్వ నివారణలో భాగంగా తిరుపతి అలిపిరి సమీపంలోని శ్రీ వేంకటేశ్వర అరవింద్ కంటి ఆసుపత్రిలో గురువారం నేత్రదాన కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా నేత్రదానం కోసం ప్రత్యేక హెల్ప్‌లైన్ నంబర్ 93983 58828ను విడుదల చేశారు. అరవింద్ కంటి ఆసుపత్రిలో 80 శాతం కంటి సమస్యలకు అత్యల్ప ఖర్చుతో ఆధునిక వైద్యసేవలు అందిస్తున్నారని, ఆసుపత్రి వైద్యులు, సిబ్బంది కృషిని అభినందించారు. స్విమ్స్ వీసీ, డైరెక్టర్ డాక్టర్ ఆర్వీ కుమార్, అరవింద్ ఆసుపత్రి జీఎం కేశవకుమార్, వైద్యులు పాల్గొన్నారు.

రేపు ఎస్వీసీసీలో జాబ్‌మేళా

తిరుపతి సిటీ : ఆంధ్రప్రదేశ్ నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో స్థానిక బాలాజీ కాలనీలోని ఎస్వీసీసీ డిగ్రీ కళాశాలలో శనివారం జాబ్ మేళా నిర్వహించనున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి లోకనాథం ఒక ప్రకటనలో తెలిపారు. ఎస్ఎస్‌సీ, ఇంటర్, డిగ్రీ, పీజీ ఉత్తీర్ణులైన అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. రిజిస్ట్రేషన్‌తో పాటు మరిన్ని వివరాలకు 79930 24898, 99888 53335 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

శ్రీవారి దర్శనానికి 24 గంటలు

తిరుమల : తిరుమలలో భక్తుల రద్దీ కొనసాగుతోంది. క్యూ కాంప్లెక్స్‌లో 6 కంపార్ట్‌మెంట్లు నిండాయి. బుధవారం అర్ధరాత్రి వరకు 77,185 మంది స్వామి వారిని దర్శించుకోగా 23,098 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామి వారికి కానుకల రూపంలో హుండీలో రూ. 3.06 కోట్లు సమర్పించారు. టైమ్‌స్లాట్ టిక్కెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. దర్శన టిక్కెట్లు లేని భక్తులకు 12 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టిక్కెట్లు కలిగిన భక్తులకు 3 గంటల్లో దర్శనం అవుతోంది. సర్వ దర్శనం టోకెన్లు కలిగిన భక్తులు నిర్దేశించిన సమయానికి క్యూలోకి వెళ్లాలని టీటీడీ విజ్ఞప్తి చేసింది.

ప్రణామం.. పావన వనమాలి

- కాణిపాకంలో భక్తి శ్రద్ధలతో చవితి వేడుక
- వైభవంగా ధ్వజారోహణం
- కిటకిటలాడిన వినాయకుని క్షేత్రం
- రెండు రోజులుగా ఆలయంలో భక్తుల సందడి

చాలు.. చాలు.. ఈ జన్మకిది చాలు.. ఏమి రూపం.. అది ఎంత అపురూపం.. లిప్తపాటు దర్శించినా చాలు తరించు మా సప్త తరాలు!! కనుద్వయం కాంచినంతనే కడతేరు కటిక కష్టాలు! నిండైన నిను చూసినంతనే పులకించే మా మేను.. ముల్లోక వీర..మహిమాన్విత దేవా.. గౌరీ తనయా.. ప్రథమ పూజల రాజా..వరలా వనమాలీ.. భక్త జన బాహుబలీ.. నమోనమామి.. మనసాస్మరామి.



కాణిపాకం ఆలయంలో ధ్వజారోహణ పూజలు



గ్రామోత్సవంలో స్వామివారు

కాణిపాకం: వరసిద్ధుడి వార్షిక బ్రహ్మోత్సవాలు గురువారం ధ్వజారోహణంతో ప్రారంభమయ్యాయి. ఉదయం ధ్వజారోహణ పూజలు భక్తిశ్రద్ధలతో జరిపారు. వేదపండితులు ధ్వజస్తంభంపై మూషిక చిత్రపటం ఎగురవేసి, ముక్కోటి దేవతలను బ్రహ్మోత్సవాలకు ఆహ్వానించారు. అనంతరం ధ్వజస్తంభం వద్ద ధూప, దీప, నైవేద్యాలు సమర్పించి, హారతులు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఈఓ పెంచల కిషోర్, ఏఈఓ రవీంద్రబాబు, సిబ్బంది కోదండపాణి, వాసు, సర్పంచ్ శాంతిసాగర్‌రెడ్డి, ఉభయకర్తలు పాల్గొన్నారు. బ్రహ్మోత్సవాల్లో భాగంలో గురువారం రాత్రి వినాయకస్వామివారు హంస వాహనంపై పురవీధుల్లో ఊరేగారు. రాష్ట్ర దేవదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి స్వామివారికి సంప్రదాయబద్ధంగా పట్టువస్త్రాలను సమర్పించారు.

ఘనంగా చవిత ఉత్సవాలు

కాణిపాకంలోని స్వయంభూ వరసిద్ధి వినాయకస్వామి వారికి బుధవారం చవితి వేడుకలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అభిషేకం, అంతరాలయ దర్శనాన్ని రద్దు చేశారు. ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులకు స్వామివారి దర్శనం నిరంతరంగా కొనసాగించారు. భక్తులు అధిక సంఖ్యలో తరలిరావడంతో క్యూలు కిక్కిరిశాయి. వీఐపీ దర్శనం వైపు కూడా భక్తులు క్యూకట్టారు. ఆలయ ఆవరణం భక్తులతో కిటకిటలాడింది. రాత్రి ఉత్సవమూర్తి మూషిక వాహనంపై విహరించారు.



కిక్కిరిసిన భక్తులు



పుష్పాలతో తీర్చిదిద్దిన వినాయకుడు

తమిళ జాలర్ల దోపిడీ

ఇరవై ఏళ్లుగా ఆంధ్రా, తమిళనాడు రాష్ట్రాల మధ్య సముద్రంపై వేట పెద్ద సమస్యగా మారింది. తరచూ ఇరురాష్ట్రాల మధ్య ఒప్పందాలు కుదుర్చినా తమిళ జాలర్లు వాటిని లెక్కచేయక హద్దులు దాటి జిల్లా తీరంలో వేట చేస్తూ మత్స్యసంపదను దోచుకుంటున్నారు. దీంతో జిల్లా మత్స్యకారులకు తీరని నష్టం వాటిల్లుతోంది. నిబంధనలకు విరుద్ధంగా వేట చేస్తూ మత్స్య సంపదను పొరుగు రాష్ట్రం జాలర్లు కొల్లగొడుతున్నారు.



కొండూరుపాలెం వద్ద సముద్రం తీరానికి వచ్చి వేట సాగిస్తున్న తమిళ జాలర్ల స్పీడు బోటు

- హద్దులు దాటి సంపదను దోచుకుపోతున్న తమిళ జాలర్లు
- పొరుగు రాష్ట్రంతో సమస్యగా మారిన వేట
- నష్టపోతున్న జిల్లా మత్స్యకారులు
- శాశ్వత పరిష్కారం లేక అవస్థలు

వాకాడు : ఆంధ్రా సరిహద్దుల్లో తమిళ జాలర్లు వేట చేయకూడదని రెండు రాష్ట్రాల మధ్య ఒప్పందాలు జరిగినా హద్దులు దాటి మత్స్య సంపదను తమిళ జాలర్లు దోచుకుపోతున్నారు. ఈ క్రమంలోనే రెండు నెలలుగా జిల్లా తీరం వెంట తమిళ జాలర్లు మళ్లీ తమ స్పీడ్ బోట్లతో నిబంధనలకు విరుద్ధంగా సముద్రంపై జల్లెడ పట్టి సముద్రంలోని మత్స్య సంపదను దోచుకుపోతున్నారు. దీంతో జిల్లాలోని 5 తీర ప్రాంత మండలాల మత్స్యకారులు విలవిలలాడుతున్నారు.

పార్లమెంటులో ప్రస్తావించిన ఎంపీ

ఇరు రాష్ట్రాల సముద్ర చేపల వేట సమస్యపై ఎంపీ గురుమూర్తి పార్లమెంటు సమావేశాల్లో పదే పదే ప్రస్తావించారు. దీనిపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు త్వరలోనే ఇరు రాష్ట్రాలతో మాట్లాడి శాశ్వత పరిష్కారం చూపుతామని చెప్పినప్పటికీ ఇంత వరకు పరిష్కారం కాలేదు.

స్పీడ్ బోట్లతో..

ఏటా జిల్లా మత్స్యకారులకు దక్కాల్సిన సుమారు 15 వేల టన్నుల మత్స్యసంపదను పొరుగు రాష్ట్రాల జాలర్లు ఎత్తుకెళ్లిపోతున్నారు. పాండిచ్చేరి, తమిళనాడు రాష్ట్రాలకు చెందిన పెద్ద బోట్లు 250 హెచ్‌పీ నుంచి 500 హెచ్‌పీ మెకనైజ్డ్ బోట్లతో ఎంఎఫ్ఆర్‌ఐ యాక్ట్ నిబంధనలకు వ్యతిరేకంగా ఆంధ్రా జలాలపై తీర ప్రాంతం దగ్గరగా వేట చేయడమే కాకుండా స్థానిక మత్స్యకారులపై దాడులు చేస్తున్నారు. ఈ విషయమై ఇటీవల కరైకల్, కడలూరు, నాగపట్నం, పాండిచ్చేరి జిల్లాలకు చెందిన 5 స్పీడు బోట్లు వివరాలను ఆయా మత్స్యశాఖ ఉన్నత స్థాయి అధికారులకు మన జిల్లా అధికారులు తెలియజేసి వారిపై చర్యలు తీసుకున్నారు.

నిబంధనలకు విరుద్ధంగా వేట

సాధారణంగా సముద్రంపై వేట చేసే మత్స్యకారులు 4 అంగులాల పైన రంధ్రాలు కలిగిన వలలను మాత్రమే వేటకు ఉపయోగించాలి. అలా కాకుండా తమిళ జాలర్లు నిబంధనలకు విరుద్ధంగా ఒక ఇంచి సైజు రంధ్రాలతో తయారు చేసిన 100 మీటర్ల వలలతో వేట చేయడంతో చిన్న చిన్న నలక చేపలతో పాటు పెద్ద చేపలు సైతం వలలో చిక్కుకుని జిల్లా మత్స్య సంపద పొరుగు రాష్టాలకు తరలిపోతోంది. వాస్తవానికి స్పీడు బోట్ల జాలర్లు సముద్రంపై అలలు లేని ప్రదేశంలో అంటే 8 నాటికల్ మైళ్ల దూరం పైన వేట సాగించాలి. అయితే అధికార నిబంధనలను భేఖాతరు చేసి 3 నాటికల్ మైళ్ల దూరంలో ఎగసిపడుతున్న అలలు సైతం లెక్క చేయకుండా వేట చేసి మత్స్య సంపదను దోచుకుపోవడంతో స్థానిక మత్స్యకారులు నష్టపోతున్నారు.

రెండు నెలలుగా జీవన భృతి లేక



చేపలు దొరక్క నిరాశతో వెను తిరిగి వస్తున్న స్థానిక మత్స్యకారులు

జిల్లాలో 79 కిలో మీటర్ల సముద్ర తీరం విస్తరించి ఉంది. 5 తీర ప్రాంత మండలాల్లో 38 మత్స్యకార గ్రామాలు ఉన్నాయి. అందులో దాదాపు 9 వేల మంది మత్స్యకారులు, 1200 వరకు ఇంజిన్ బోట్లు ఉన్నాయి. రెండు నెలలుగా పొరుగు రాష్ట్రాల జాలర్ల దెబ్బకు స్థానిక మత్స్యకారులు విలవిల్లాడుతున్నారు. చేపల వేటే జీవనాధారంగా జీవించే మత్స్యకారులు రెండు నెలలుగా జీవన భృతిని కోల్పోయారు. ఈసారి వర్షాలు సమృద్ధిగా కురిసి వాగులు, వంకలు, నదులపై ప్రవహించి వరద సముద్రంలో కలిసింది. ఆ మేరకు మత్స్య సంపద పుష్కలంగా దొరుకుతున్న సమయంలో తమిళనాడు, కడూరు, నాగూరు నాగపట్నం, తూత్‌కుడి, తదితర ప్రాంతాలకు చెందిన జాలర్లు స్పీడు బోట్లుతో మత్స్య సంపదను దోచుకుపోతున్నారు.



స్థానిక మత్స్యకారుల అదుపులో తమిళ జాలర్ల బోటు (ఫైల్)

చర్చలు జరిగినా ఫలితం లేదు



పొరుగు రాష్ట్రాలకు చెందిన జాలర్లు స్పాడు బోట్లుతో తమ పరిధిలో అక్రమంగా వేట చేయడమే కాకుండా తమపై దాడులు చేసి గాయపరుస్తున్నారు. ఇప్పటికే పలుమార్లు ఇరు రాష్ట్రాల అధికారులు చర్చలు జరిగినా ఫలితం కనిపించలేదు. ఇకనైనా పొరుగు రాష్ట్రాల స్పీడు బోట్లు దాడుల నుంచి స్థానిక మత్స్యకారులను కాపాడాలి.

పోలయ్య మత్స్యకారుడు, కొండూరుపాళెం

అధికారులు చొరవ చూపాలి



నిబంధనలను ఉల్లంఘించి తమిళ జాలర్లు మత్స్యసంపదను దోచుకుపోతున్నారు. దీంతో తాము రోజంతా వేట చేసినా ఒక్క చేప దొరక్క పస్తులు ఉండాల్సి వస్తోంది. అధికారులు చొరవ చూపాలి. లేకపోతే జిల్లా మత్స్యకారులకు జీవన భృతి లేకుండా పోతుంది.

– మునిస్వామి, మత్స్యకారుడు, ఓడపాళెం

తొలగించిన దివ్యాంగుల పింఛన్లు పునరుద్ధరించాలి



కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పిస్తున్న జేఏసీ నేతలు

తిరుపతి అర్బన్ : తొలగించిన అర్హులైన దివ్యాంగుల పింఛన్లు పునరుద్ధరించాలని వికలాంగుల ఐక్య కార్యాచరణ సమితి నేతలు కొణతం చంద్రశేఖర్, కొండామరి సుబ్రమణ్యం, జడపల్లి మురళీ గౌడ్ కలెక్టర్ వెంకటేశ్వర్‌కు విజ్ఞప్తి చేశారు. ఈనెల 21వ తేదీన కలెక్టరేట్ ఎదుట వికలాంగుల ఐక్య కార్యాచరణ సమితి (జేఏసీ) ఆధ్వర్యంలో భారీ ధర్నా నిర్వహించారు. ఈ విషయంపై కలెక్టర్ వెంకటేశ్వర్‌కు గురువారం జేఏసీ నాయకులు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ సదరం రీ వెరిఫికేషన్ లో దివ్యాంగులకు ఎదురవుతున్న సమస్యలను జేఏసీ నేతలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రభుత్వ డాక్టర్లు అర్హులైన వికలాంగుల సదరం సర్టిఫికెట్ల నందు వికలత్వ శాతంను భారీగా తగ్గించడంతో 80 శాతం కన్నా తక్కువ వైకల్యం ఉన్న వారు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలను కోల్పోతారని ఆవేదన వ్యక్తం చేశారు. సదరం రీ వెరిఫికేషన్‌లో డాక్టర్లు మొక్కుబడిగా వైకల్య నిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తున్నట్లుగా జేఏసీ నేతలు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. అర్హత ఉండి పింఛన్లు తొలగించినట్లుగా నోటీసులు అందుకున్న దివ్యాంగులకు యథావిధిగా పింఛన్లు ఇవ్వాలని జేఏసీ నేతలు కలెక్టర్‌ను కోరారు. కార్యక్రమంలో వికలాంగుల ఐక్య కార్యాచరణ సమితి (జేఏసీ) రాష్ట్ర అధ్యక్షుడు కొణతం చంద్రశేఖర్, పీడబ్ల్యూడీ ప్రధాన కార్యదర్శి కొండామరి సుబ్రమణ్యం, దివ్యాంగుల సేవా సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు జడపల్లి మురళీ గౌడ్, రామచంద్ర, గోవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

ఏ నిమిషానికి ఏమి జరుగునో?

డీఎస్సీ.. ఇది జిల్లాస్థాయికే పరిమితం.. అయితే ప్రస్తుత డీఎస్సీ రాష్ట్రస్థాయిలో సాగుతోంది. జిల్లాస్థాయిలో పారదర్శకంగా సాగాల్సిన ఈ ప్రక్రియను కూటమి సర్కారు పక్కదారి పట్టిస్తోంది. ఫలితంగా ఏ నిమిషానికి ఏమి జరుగుతుందో తెలియక, అభ్యర్థుల్లో గందరగోళం నెలకొంది. ఫలితంగా వారు అర్హత సాధించిన అభ్యర్థులు సైతం ఆందోళన చెందాల్సి వస్తోంది.

- అంతా గందరగోళమే
- పేరుకే డిస్ట్రిక్ సెలక్షన్ కమిటీ
- తుది సెలక్షన్ జాబితా వెల్లడించకుండా పరిశీలన
- లోగుట్టు రహస్యాలపై పలు అనుమానాలు
- 1,478 మందికిగాను 1,099 మందికే కాల్‌లెటర్లు
- కొంత మందికి కాల్‌లెటర్లు, మరికొంత మందికి మెసేజ్‌లు
- మెగా డీఎస్సీ ప్రక్రియపై అభ్యర్థుల పెదవి విరుపు



పరిశీలన కేంద్రాల్లో నిరీక్షిస్తున్న డీఎస్సీ అభ్యర్థులు



ఎస్వీ సెట్ ఇంజినీరింగ్ కళాశాలలో సర్టిఫికెట్ల పరిశీలనకు విచ్చేసిన డీఎస్సీ అభ్యర్థులు

చిత్తూరు కలెక్టరేట్ : ఉమ్మడి చిత్తూరు జిల్లా వ్యాప్తంగా డీఎస్సీ పరీక్షలు రాసిన అభ్యర్థుల్లో గందరగోళం నెలకుంది. కూటమి ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరుపై డీఎస్సీ అభ్యర్థుల్లో పలు అనుమానాలు నెలకొన్నాయి. పారదర్శకంగా నిర్వహించాల్సిన డీఎస్సీ ప్రక్రియను కూటమి ప్రభుత్వం పక్కదారి పట్టించింది. ప్రక్రియ మొత్తం రాష్ట్ర స్థాయిలో రహస్యంగా చేపడుతూ పలు అనుమానాలకు తావిస్తోంది. డీఎస్సీ అంటే డిస్టిక్ సెలక్షన్ కమిటీ. జిల్లాస్థాయి కమిటీలో చేపట్టాల్సిన ఎంపిక ప్రక్రియను కూటమి ప్రభుత్వం రహస్యంగా రాష్ట్రస్థాయిలో నిర్వహిస్తోంది. ఎన్నో ఏళ్లుగా సాగుతున్న డీఎస్సీ ప్రక్రియ నిబంధనలకు ప్రస్తుతం తూట్లు పొడిచింది. కూటమి ప్రభుత్వం చేపడుతున్న మెగా డీఎస్సీ ప్రక్రియపై అభ్యర్థులు పెదవి విరుస్తున్నారు. ఉమ్మడి చిత్తూరు జిల్లా పరిధిలో డీఎస్సీ పరీక్షలు రాసి ఎంపికైన అభ్యర్థులకు గురువారం సర్టిఫికెట్ల పరిశీలన కార్యక్రమం చేపట్టారు. ఈ ప్రక్రియను చిత్తూరు జిల్లా కేంద్రం సరిహద్దులో ఉన్న అపోలో యూనివర్సిటీ, ఆర్వీఎస్ నగర్‌లో ఎస్వీ సెట్ ఇంజినీరింగ్ కళాశాలలో నిర్వహించారు. ఈ ప్రక్రియ గురువారం రాత్రి వరకు 50 శాతం పూర్తి కాని పరిస్థితి నెలకొంది.

1,478 మందికి గాను 1,099 మందికే..

ఉమ్మడి చిత్తూరు జిల్లా పరిధిలో 1,478 మందికి గాను 1,099 మందికి మాత్రమే కాల్‌లెటర్లు పంపి గురువారం సర్టిఫికెట్ల పరిశీలన చేపట్టారు. సర్టిఫికెట్ల పరిశీలన చేసుకున్నంతనే ఉద్యోగం వచ్చినట్టు కాదనే మెలిక పెట్టారు. అలాగే తుది ఎంపిక జాబితాను ప్రచురించకపోవడంతో అభ్యర్థుల్లో గందరగోళం నెలకుంది. 379 మంది అభ్యర్థులకు కాల్ లెటర్లు రాకపోవడంతో ఆందోళనతో సర్టిఫికెట్ పరిశీలన కేంద్రాలకు విచ్చేశారు. అనంతరం మిగిలిన 379 మందికి త్వరలో కాల్‌లెటర్లు పంపుతారని అధికారులు సమాధానమిచ్చారు. సాయంత్రం వరకు కేంద్రాల వద్ద పడిగాపులు కాసి అభ్యర్థులు చేసేదేమి లేక వెనుదిరిగారు. కొంత మందికి కాల్‌లెటర్లు, మరికొంత మందికి మెసేజ్‌లు పంపడంతో గందరగోళం నెలకొంది.

అర్ధరాత్రి వరకు పడిగాపులు

కూటమి ప్రభుత్వం అలసత్వ వైఖరితో డీఎస్సీ అభ్యర్థులు గురువారం పరిశీలన కేంద్రాల్లో అర్ధరాత్రి వరకు పడిగాపులు కాయాల్సిన దుస్థితి నెలకొంది. ముందస్తుగా సెలక్షన్ జాబితాను పారదర్శకంగా ప్రచురించి సర్టిఫికెట్ల పరిశీలన చేయాల్సింది పోయి ఎలాంటి జాబితా ప్రచురించకుండా పరిశీలన చేపట్టారు. ఇదేమిటని పలువురు సంఘ నాయకులు రాష్ట్ర విద్యాశాఖ అధికారులను ప్రశ్నించారు. ఇందుకు రాష్ట్ర స్థాయి అధికారులు పరిశీలన ప్రక్రియ తాత్కాలికం మాత్రమేనని చెప్పడం కొసమెరుపు. గతంలో ఎంపిక జాబితాను పత్రికలకు వెల్లడించేవారు. అయితే ప్రస్తుతం అభ్యర్థుల వ్యక్తిగత లాగిన్‌లకే పంపి గందరగోళానికి తెరలేపారు. గురువారం సర్టిఫికెట్ల పరిశీలన కేంద్రాల్లో పలు సమస్యలు చోటు చేసుకున్నాయి. చిన్న చిన్న తప్పిదాలు, అవగాహన లేక కొంత మంది అభ్యర్థులు అర్హులైనప్పటికీ తప్పుగా ఒక సర్టిఫికెట్ బదులు మరో సర్టిఫికెట్ అప్‌లోడ్ చేశారు. అటువంటి అభ్యర్థుల సమస్యలను పరిష్కరించాల్సి ఉంటుంది. అయితే జిల్లా అధికారులు పరిష్కారం తమ చేతుల్లో లేదని చేతులెత్తేశారు. సర్వర్ మొరాయింపుతో గురువారం రాత్రి 8 గంటల వరకు 51 శాతమే పరిశీలన పూర్తి అయ్యింది. ఈ ప్రక్రియ అర్ధరాత్రి వరకు కొనసాగే పరిస్థితి ఉండడంతో దూర ప్రాంతాల నుంచి విచ్చేసిన అభ్యర్థులు పడిగాపులు కాయాల్సిన దుస్థితి నెలకొంది.

మెగా డీఎస్సీ కాదు దగా డీఎస్సీ

కూటమి ప్రభుత్వం చేపట్టింది మెగా డీఎస్సీ కాదు..దగా డీఎస్సీ అని విద్యావేత్తలు, పరీక్షలు రాసిన అభ్యర్థులు విమర్శలు గుప్పిస్తున్నారు. డీఎస్సీ అంటేనే డిస్ట్రిక్ట్ సెలక్షన్ కమిటీ అని అర్థం ఉంది. అయితే ఆ అర్థానికి కూటమి ప్రభుత్వం తిలోదకాలు పలికింది. జిల్లా స్థాయిలో కమిటీగా ఏర్పడి నిర్వహించాల్సిన ఎంపిక ప్రక్రియను రాష్ట్ర స్థాయిలో నిర్వహిస్తోంది. గతంలో ఎన్నడూ ఇలా జరగలేదని అభ్యర్థులు మండిపడుతున్నారు. రాష్ట్ర స్థాయిలో జాబితాలు మొత్తం సిద్ధం చేస్తుండడంతో పలు అనుమానాలు తలెత్తుతున్నట్లు అభ్యర్థులు వాపోతున్నారు. పూర్తి స్థాయిలో స్పష్టంగా తుది ఎంపిక జాబితాలు ప్రచురించకపోవడంపై ఆంతర్యమేమిటో తెలియజేయాలని అభ్యర్థులు డిమాండ్ చేస్తున్నారు. కూటమి ప్రభుత్వానికి అనుకూలమైన అభ్యర్థులకు న్యాయం చేసేందుకు ఇలాంటి లోగుట్టు ప్రక్రియ చేపడుతోందనే విమర్శలు బహిరంగంగా వినిపిస్తున్నాయి.

1000 మెగావాట్ల థర్మల్ విద్యుత్ సరఫరాకు సన్నద్ధం



వేదాంత మీనాక్షి థర్మల్ విద్యుత్ కేంద్రం

చిల్లకూరు : మండలం తీర ప్రాంతంలోని తమ్మినపట్నంలోని వేదాంత మీనాక్షి థర్మల్ విద్యుత్ పరిశ్రమలో 1000 మెగావాట్లు గ్రిడ్‌కు సరఫరా చేసేందుకు గురువారం సిద్ధం చేశారు. రెండేళ్ల కిందట మీనాక్షి పవర్ ప్లాంట్‌ను గుజరాత్‌కు చెందిన వేదాంత లిమిటెడ్ సంస్థ సొంతం చేసుకుంది. గతంలో మీనాక్షి విద్యుత్ పరిశ్రమలో 350 మెగావాట్లు, 150 మెగావాట్లు రెండు యూనిట్లు పనిచేస్తుండగా ప్రస్తుతం వేదాంత మీనాక్షి ఎనర్జీ అదనంగా మరో 500 మెగావాట్ల యూనిట్లను అందుబాటులోకి తీసుకొచ్చి గ్రిడ్‌కు 1000 మెగా వాట్ల విద్యుత్‌ను సరఫరా చేసేందుకు సిద్ధం చేసింది. ఈ క్రమంలో గురువారం దీనిని ప్రారంభించి అందుబాటులోకి తీసుకొచ్చినట్లు విద్యుత్ పరిశ్రమ సీఈఓ రాజేంద్రసింగ్ అహుజా తెలిపారు. పర్యావరణ పరిరక్షణ , సిబ్బంది భద్రతకు ప్రాధాన్యం ఇస్తున్నామని తెలిపారు. ఆయన వెంట పరిశ్రమ జీఎం శేషగిరి, సెక్యూరిటీ చీఫ్ శివరామక్రిష్ణ ఉన్నారు.

క్లుప్తంగా

పోలేరమ్మ జాతరకు అనుమతులు



జాతర ప్రారంభంలో ఈఓ, రాజా కుటుంబీకులు

వెంకటగిరి (సైదాపురం) : దక్షిణ భారతదేశంలో ప్రసిద్ధి చెందిన వెంకటగిరి శక్తి స్వరూపిణి పోలేరమ్మ తల్లి జాతర నిర్వహణకు సంబంధించి వెంకటగిరి రాజా కుటుంబ సభ్యులు, మాజీ ఎమ్మెల్యే, ఎస్వీబీసీ చైర్మన్ డాక్టర్ వీబీ సాయికృష్ణ యాచేంద్ర చేతుల మీదుగా జాతర ప్రారంభానికి ఈఓ శ్రీనివాసులరెడ్డి అనుమతి జారీ చేశారు.

తొలి చాటింపు

వెంకటగిరి రూరల్ : పోలేరమ్మతల్లి జాతర తొలి చాటింపు ఘనంగా జరిగింది. పట్టణంలోని కాంపాళెం కామాక్షమ్మ దేవస్థానంలో ప్రత్యేక పూజలు చేసి అమ్మవారి జాతరకు సంబంధించి అమ్మవారి సేవకులు తొలి చాటింపు వేశారు. యువకులు, పట్టణ ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

గుర్తు తెలియని మహిళ మృతదేహం లభ్యం

పెళ్లకూరు : మండలంలోని దిగువ కాలవకూరు సమీపంలోని స్వర్ణముఖినది ఇసుక తిన్నెలపై గుర్తు తెలియని మహిళ శవాన్ని గురువారం స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. ఎస్ఐ నాగరాజు వివరాల మేరకు.. సుమారు 35 ఏళ్ల వయస్సు కలిగిన మహిళ నెల క్రితం మృతి చెంది ఉండొచ్చని పోలీసులు భావిస్తున్నారు. మృతురాలి వివరాల కోసం మృతదేహాన్ని పరీక్షల నిమిత్తం తగిన చర్యలు చేపట్టారు. వేరే ప్రాంతంలో హత్యకు గురై నదిలో పడేశారా అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

WANTED

ప్రభుత్వ సంస్థలలో ప్రైవేట్ సెక్యూరిటీ గార్డ్స్, సూపర్‌వైజర్స్‌గా పనిచేయుటకు ఆసక్తిగల పురుషులు కావలయును. ఆకర్షణీయమైన జీతం కలదు. సూపర్‌వైజర్స్ - Qua - Degree
సెక్యూరిటీ గార్డ్స్ - Qua - 10th Class ఆపైన

Wanted

- Primary Teachers (Maths, English & EVS)
- High School Teachers (English)

Attend interviews On 30th August (Saturday), sharp 9am (No entry after 9:30am)

SLATE - The School, Venkataramapuram, Tirupati. Ph: 8333 909 103

email: slatetirupati@gmail.com

యువకుడి దారుణ హత్య

- పాతకక్షలే కారణమా?
- దర్యాప్తు చేస్తున్న పోలీసులు



శివారెడ్డి (ఫైల్)

వెంకటగిరి రూరల్ : మండలంలోని అమ్మపాళెం గ్రామానికి చెందిన శివారెడ్డి(27) దారుణ హత్యకు గురయ్యాడు. ఈ ఘటన పట్టణంలోని రైల్వేస్టేషన్ సమీపం వద్ద గురువారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పోలీసుల కథనం మేరకు వివరాలు ఇలా.. వెంకటగిరి రూరల్ మండలానికి చెందిన శివారెడ్డి (23) పట్టణంలో ఫొటో స్టూడియో నిర్వహించుకుంటున్నాడు. అమ్మపాళెం గ్రామానికి చెందిన కొందరు వ్యక్తులతో మంగళవారం రాత్రి శివారెడ్డి పట్టణంలోని రైల్వేస్టేషన్ సమీపంలోని జామాయిల్ చెట్ల వద్దకు వెళ్లినట్లు సీసీ కెమెరాలో రికార్డయిందన్నారు. ఈ మేరకు బాధితుడు శివారెడ్డి కనిపించడంలేదని మంగళవారం రాత్రి పోలీసులకు కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు దర్యాప్తు చేపట్టిన పోలీసులు రైల్వేస్టేషన్ సమీపంలోని జామాయిల్ చెట్ల వద్ద దారుణ హత్యకు గురయినట్లు గుర్తించామన్నారు. సమాచారం అందుకున్న గూడూరు డీఎస్పీ గీతా కుమారి ఘటనా స్థలం వద్దకు చేరుకొని మృతదేహాన్ని పరిశీలించారు. మృతదేహం కుళ్లిపోవడంతో అక్కడికక్కడే పోస్టుమార్టం నిర్వహించారు. శివారెడ్డి మృతి చెందడంపై కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. పాత కక్షల నేపథ్యంలోనే హత్య చేసి ఉంటారని కుటుంబ సభ్యులు, స్థానికులు ఆరోపిస్తున్నారు.



శివారెడ్డి మృతదేహాన్ని పరిశీలిస్తున్న గూడూరు డీఎస్పీ గీతా కుమారి, సీఐ ఏవీ రమణ తదితరులు

చంద్రగిరిలో రౌడీ షీటర్ హత్య

వివాహేతర సంబంధమే ప్రధాన కారణం

చంద్రగిరి : రౌడీ షీటర్‌ను యువకుడు హత్య చేసిన ఘటన బుధవారం చంద్రగిరిలో కలకలం రేపింది. పోలీసుల వివరాల మేరకు.. స్థానిక చంద్రగిరిలోని జెండామాను వీధికి చెందిన రౌడీ షీటర్ అశోక్ కుమార్ అలియాస్ కొండపల్లి రాజా(53), చంద్రగిరి ఇందిరమ్మ కాలనీలోని ఓ మహిళతో కొన్నాళ్లుగా వివాహేతర సంబంధం పెట్టుకున్నాడు. దీంతో మహిళ కుమారుడు అక్బర్‌కు మృతుడికి పలుమార్లు గొడవలు జరుగుతూ వస్తున్నాయి. ఈ క్రమంలో బుధవారం కొండపల్లి రాజా, ఇందిరమ్మ కాలనీలోని మహిళ ఇంటికి వెళ్లాడు. ఈ క్రమంలో ఇంట్లో ఉన్న అక్బర్, కొండపల్లి రాజాతో గొడవకు దిగాడు. ఇద్దరు ఒకరిపై ఒకరు దాడులు చేసుకున్నారు. తీవ్ర ఆగ్రహానికి గురైన కొండపల్లి రాజా తన వద్ద ఉన్న కత్తితో అక్బర్‌పై దాడికి యత్నించడంతో అక్బర్ చేతి వేళ్లకు గాయాలయ్యాయి. అపై అక్బర్ కొండపల్లి రాజాపై దాడికి పాల్పడటంతో ఒక్కసారిగా కిందపడిపోయాడు. దీంతో తీవ్ర కోపోద్రిక్తుడైన అక్బర్ పక్కనే ఉన్న పెద్ద బండరాయి తీసుకుని రౌడీషీటర్ కొండపల్లి రాజా తలపై గట్టిగా మోదాడు. ఈ గొడవలో కొండపల్లి రాజా తలకు తీవ్ర గాయం కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. అనంతరం చేతివేళ్లకు గాయాలైన అక్బర్ స్థానిక ఏరియా ఆసుపత్రిలో చికిత్సకు వెళ్లాడు. సమాచారం అందుకున్న సీఐ ఇమ్రాన్ బాషా, ఎస్ఐ అనిత ఘటనా స్థలానికి చేరుకుని, మృతదేహాన్ని పరిశీలించారు. గొడవకు గల కారణాలను స్థానికులను విచారించి, వివరాలను నమోదు చేశారు. ఏరియా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న అక్బర్‌ను పోలీసులు అదుపులోకి తీసుకుని విచారించారు. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం తిరుపతి ఎస్వీ మెడికల్ కళాశాలకు తరలించారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని గురువారం కుటుంబ సభ్యులకు అందజేశారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు అక్బర్‌పై కేసు నమోదు చేసి పోలీసులు విచారణ చేపట్టారు. ఇదిలా ఉండగా ఇద్దరి మధ్య జరిగిన గొడవలో కొండపల్లి రాజా నుంచి తప్పించుకునేందుకు తోయడంతో ప్రమాదవశాత్తు కొండపల్లి రాజాకు బండరాయి మీద పడటంతో తీవ్ర గాయాలై మృతి చెందినట్లుగా అక్బర్ కుటుంబ సభ్యులు చెబుతున్నారు.



చికిత్స పొందుతున్న అక్బర్



కొండపల్లి రాజా(ఫైల్)

గంజాయి మత్తులో వ్యక్తిపై కత్తితో దాడి



వైద్యశాలలో చికిత్స తీసుకుంటున్న క్షతగాత్రుడు

సూళ్లూరుపేట రూరల్ : సూళ్లూరుపేటలో గురువారం గంజాయి సేవిస్తున్న కొందరు వ్యక్తులు ఓ వ్యక్తిని కత్తితో తలపై దాడి చేసి త్రీవంగా గాయపరిచారు. బాధితులు సమాచారం మేరకు సూళ్లూరుపేట పట్టణం సాయినగర్ ప్రాంతానికి చెందిన ఎస్‌కే బాబు కూరగాయల మార్కెట్‌లో పని చేస్తున్నాడు. వేకువజామున కూరగాయల మార్కెట్‌కు వెళ్లేందుకు సాయినగర్ నుంచి జాతీయ రహదారిపై వస్తుండగా నిరంతరం అక్కడ గంజాయి సేవిస్తుండే కొందరు వ్యక్తులు హఠాత్తుగా ఎస్‌కే బాబు తలపై కత్తితో దాడిచేశారు. గాయపడిన బాబు గట్టిగా కేకలు వేడంతో గంజాయి సేవించి ఉన్న వ్యక్తులు అక్కడ నుంచి పరారయ్యారు. గాయపడిన బాబును వెంటనే స్థానికులు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. క్షతగాత్రని కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు అందజేశారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి



వేలు (ఫైల్)

నాగలాపురం : గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి చెందిన ఘటన నాగలాపురంలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు... పట్టణంలోని బీసీ కాలనీకి చెందిన ముట్టదొరై కుమారుడు వేలు(42) పిచ్చాటూరులోని ఓ హోటల్ పని చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. పని పూర్తి చేసుకుని బుధవారం రాత్రి పిచ్చాటూరు నుంచి ఇంటికి బయలు దేరగా మార్గమధ్యలో నాగలాపురంలో చెల్లియమ్మన్ ఆలయం వద్ద గుర్తు తెలియని వాహనం ఢీకొని మృతి చెందాడు. ఈ విషయాన్ని స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించగా పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం సత్యవేడు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుడికి భార్య ఇద్దరు పిల్లల్లు ఉన్నారు.

టీటీడీ చైర్మన్ నీచ విమర్శలు దుర్మార్గం

- వైఎస్సార్‌సీపీ రైతు విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మధుసూదన్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ రైతు విభాగం రాష్ట్ర అధ్యక్షుడు చిందేపల్లి మధుసూదన్‌రెడ్డి

తిరుపతి కల్చరల్ : సనాతన ధర్మ పరిరక్షణ కోసం పని చేయాల్సిన పవిత్రమైన టీటీడీ చైర్మన్ హోదాలో ఉన్న బీఆర్ నాయుడు ధర్మాన్ని మరిచి వైఎస్సార్‌సీపీ నేతలపై నీచమైన విమర్శలు చేయడం అత్యంత దుర్మార్గమని వైఎస్సార్‌సీపీ రైతు విభాగం రాష్ట ప్రధాన కార్యదర్శి చిందేపల్లి మధుసూదన్‌రెడ్డి తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. గురువారం ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాజకీయ పార్టీల మధ్య విమర్శలు సాధారణమే అయినా తిరుమల దైవ సన్నిధి వద్ద టీటీడీ చైర్మన్ హోదాలో ఆయన నీతి మాలిన భాషతో రాజకీయ విమర్శలు చేయడం సిగ్గుచేటన్నారు. కలియుగ ప్రత్యక్ష దైవం వెలిసిన తిరుమలలో టీటీడీ మాజీ చైర్మన్ కరుణాకరరెడ్డిని దూషించడం, టీడీఆర్ బాండ్లలో జైలుకు వెళ్తారని విమర్శలు చేయడం విడ్డూరమన్నారు. అలాగే మాజీ మంత్రి రోజాను డైమండ్ రాణి అంటూ సంబోధిస్తూ ఆమె అరెస్ట్ తప్పదని మాట్లాడం తగదన్నారు. ఏ రాజకీయ చరిత్రలేని, ఎలాంటి ప్రజా సేవ చేయని బీఆర్ నాయుడు టీటీడీ చైర్మన్‌గా ఏ హోదాలో వచ్చారో ప్రజలకు చెప్పాల్సిన అవసరం ఉందన్నారు. టీటీడీ చైర్మన్ పదవి రావాలంటే ఆ వ్యక్తి అధికార పార్టీకి పెద్ద ఎత్తున సేవచేసయినా ఉండాలని, లేదా పెద్ద మొత్తంలో ముడుపులు అయినా చెల్లించి ఉండాలని అన్నారు. ఇందులో బీఆర్ నాయుడుకు ఏం చేస్తే టీటీడీ చైర్మన్ పదవి ఇచ్చారో చెప్పాలని డిమాండ్ చేశారు. టీటీడీ చైర్మన్‌గా బీఆర్ నాయుడు వచ్చినప్పటి నుంచి టీటీడీలో అన్ని అపవాదాలే చోటు చేసుకుంటున్నాయని, వైకుంఠ దర్శన టిక్కెట్లు జారీలో 6 మంది భక్తులు మృతి, గోశాలలో గోవులు మృతి ఇందుకు నిదర్శనం కాదా అని ప్రశ్నించారు. జగన్‌మోహన్ రెడ్డి పుష్కరిణిలో స్నానం చేసి తలనీలాలు ఇవ్వాలని టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు డిమాండ్ చేశారని, అయితే వచ్చే బ్రహ్మోత్సవాలకు పట్టు వస్త్రాలు తీసుకొచ్చే సీఎం చంద్రబాబునాయుడు, ఆయన కుటుంబ సభ్యులతో పుష్కరిణిలో స్నానం చేయించి, తలనీలాలు ఇచ్చిన తర్వాత పట్టు వస్త్రాలు ఇప్పించగలరా అని బీఆర్ నాయుడును ప్రశ్నించారు.

మీరు ప్రమాణం చేయగలరా?

తాను టీటీడీ చైర్మన్‌గా ఉండగా శ్రీవారి సన్నిధిలో అపచారం జరగలేదని భూమన కరుణాకర రెడ్డి ప్రమాణం చేశారని, అదే విధంగా బీఆర్ నాయుడి హయాంలో ఎటువంటి అపచారం జరగలేదని ప్రమాణం చేయగలరా అని మధుసూదన్ రెడ్డి సవాల్ విసిరారు.

భూమన అనేక సంస్కరణలు

గతంలో టీటీడీ చైర్మన్‌గా భూమన కరుణాకరరెడ్డి టీటీడీలో అనేక సంస్కరణలు తీసుకొచ్చి భక్తజనం ప్రశంసలు అందుకున్నారని మధుసూదన్‌రెడ్డి తెలిపారు. ఎస్వీబీసీ చానల్ ద్వారా శ్రీవారి విశిష్టతను ప్రపంచానికి చాటారని, దళిత గోవిందం వంటి కార్యక్రమాలు చేపట్టిన చరిత్ర ఉందన్నారు. టీటీడీ చైర్మన్‌గా ఒక గొప్ప పని ఏదైనా చెప్పగలవా అని ఆయన బీఆర్ నాయుడుని ఆయన సూటిగా ప్రశ్నించారు. చేసింది ఏమీ లేకపోయినా చేసిన వారిపై నిందలు వేస్తూ అపనిందలపాలు చేయాలని చూడడం హేయమైన చర్య అన్నారు. కక్ష సాధింపు రాజకీయాలకు పాల్పడుతూ తన నేతలతో ముందుగా సంకేతాలు ఇచ్చి తర్వాత ప్రతిపక్షాల అణచివేతకు పూనుకోవడం చంద్రబాబు నైజమని మధుసూదన్‌రెడ్డి విమర్శించారు. ఈ సమావేశంలో వైఎస్సార్‌సీపీ నేతలు వెంకటేష్‌రెడ్డి, వెంకటరత్నం పాల్గొన్నారు.

స్మార్ట్ సిటీ పెండింగ్ పనులు పూర్తి చేయండి



అధికారులకు సూచనలిస్తున్న కలెక్టర్

తిరుపతి తుడా : స్మార్ట్ సిటీ నిధులతో జరుగుతున్న అభివృద్ధి పనులు త్వరగా పూర్తి చేయాలని కలెక్టర్ డాక్టర్.ఎస్. వెంకటేశ్వర్ ఆదేశించారు. తిరుపతి స్మార్ట్ సిటీ బోర్డ్ ఆఫ్ డైరెక్టర్ల 40వ సమావేశం గురువారం నిర్వహించారు. ఆన్‌లైన్ ద్వారా చైర్మన్, కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్, శుభం బన్సల్ పాల్గొనగా నగరపాలక సంస్థ కార్యాలయం నుంచి స్మార్ట్ ఎండీ, నగరపాలక సంస్థ కమిషనర్ మౌర్య పాల్గొన్నారు. పురోగతిలో ఉన్న ప్రాజెక్టులు త్వరగా పూర్తి చేసేలా అధికారులు పర్యవేక్షణ చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. 6 మెగా వాట్స్ సోలార్ ప్రాజెక్టులు పరిశీలించి పీపీపీ మోడ్‌లో నిర్వహణ చేసేందుకు టెండర్లు పిలవాలని నిర్ణయించారు. ఇంటిగ్రేటెడ్ కమాండ్ అండ్ కంట్రోల్ ప్రాజెక్టుతో పాటు ప్రస్తుతం పురోగతిలో ఉన్న ప్రాజెక్టులు త్వరగా పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ సమావేశంలో స్మార్ట్ సిటీ ఇండిపెండెంట్ డైరెక్టర్స్ డాక్టర్ రామచంద్రారెడ్డి, డాక్టర్ రమాశ్రీ, ఇంజినీరింగ్ అధికారులు, స్మార్ట్ సిటీ అధికారులు పాల్గొన్నారు .

నేత్రదానానికి ముందుకు రావాలి



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న కలెక్టర్, జేసీ, అధికారులు

తిరుపతి అర్బన్ : నేత్రదానం చేయడానికి ప్రజలు పెద్ద ఎత్తున ముందుకు రావాలని కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్ ప్రజలకు పిలుపునిచ్చారు. జాతీయ నేత్రదాన పక్షోత్సవాల్లో భాగంగా గురువారం కలెక్టరేట్‌లో జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్ తో కలిసి పోస్టర్లను ఆవిష్కరించారు. ప్రతిజ్ఞా పత్రంపై నేత్రదానానికి స్వచ్ఛందంగా అంగీకారం తెలుపుతూ సంతకం చేసి ఎస్వీ మెడికల్ కాలేజ్, రుయా ఆసుపత్రి నేత్ర విభాగపు అధిపతికి అందించారు. జిల్లా కలెక్టర్‌తో పాటు తండ్రి నేత్రాలను సైతం వారి మరణాంతరం అందించేలా ప్రతిజ్ఞా పత్రంపై సంతకం చేశారు. కార్యక్రమంలో డీఎంహెచ్ డాక్టర్ బాలకృష్ణ నాయక్, రుయా సూపరింటెండెంట్ డాక్టర్ రాధా, ఎస్వీ మెడికల్ కాలేజ్, రుయా ఆస్పత్రి కంటి విభాగాధిపతి ప్రొఫెసర్ డాక్టర్ చలపతి రెడ్డి, రమేష్ పాల్గొన్నారు.

ల్యాప్‌టాప్ దొంగల అరెస్టు



రికవరీ అయినా వస్తువులను చూపిస్తున్న పోలీస్ అధికారులు

రేణిగుంట: ఏర్పేడు మండలంలోని తిరుపతి ఐఐటీలో ఇటీవల ల్యాప్‌టాప్‌ల దొంగతనానికి పాల్పడిన తమిళనాడుకు చెందిన ఇద్దరు నిందితులను అరెస్టుచేసి పోలీసులు రిమాండ్‌కు తరలించారు. రేణిగుంటలో గురువారం ఏఎస్పీ రవిమనోహరాచారి ఆ వివరాలను వెల్లడించారు. తిరుపతి జిల్లా ఎస్పీ ఆదేశాలతో ల్యాప్‌ట్యాప్‌ల చోరీ కేసుపై దర్యాప్తు చేపట్టి ఈనెల 27వ తేదీన ఏర్పేడు సీఐ బి.శ్రీకాంత్ రెడ్డి, ఎస్ఐ శ్రీకాంత్ రెడ్డి బృందం నేతృత్వంలో ల్యాప్‌టాప్‌ల చోరీలకు పాల్పడుతున్న తమిళనాడు రాష్ట్రానికి చెందిన తమిళ్ సెల్వన్, వీరాస్వామి గణేషన్‌ను అరెస్టు చేసినట్టు తెలిపారు. వీరు ఐఐటీ, మెడికల్ కళాశాలలో ల్యాప్‌ట్యాప్‌లు చోరీకి పాల్పడుతున్నట్లు తెలిపారు. వారి నుంచి 8 లక్షల రూపాయలు విలువచేసే 15 ల్యాప్‌టాప్‌లు, 3 మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. నిందితులపై గతంలో సుమారు 500 ల్యాప్‌ట్యాప్‌ల చోరీలపై 9 కేసులు ఉన్నాయని వివరించారు. నిందితులను చాకచక్యంగా అరెస్టు చేసిన సిబ్బందిని ఎస్పీ అభినందించి రివార్డులు ప్రకటించారని తెలిపారు. సమావేశంలో డీఎస్పీ శ్రీనివాసులు, ఏర్పేడు సీఐ శ్రీకాంత్ రెడ్డి, అర్బన్ సీఐ జయచంద్ర, ఎస్ఐ శ్రీకాంత్ రెడ్డి, పీఎస్ఐ ఇమామ్ హుస్సేన్, వెంకటలక్ష్మి, సిబ్బంది రాజశేఖర్, భారుషా, మహేంద్ర బాలు, మణి, మునేంద్ర, కార్తీక్ పాల్గొన్నారు.

క్వాంటమ్ టెక్నాలజీదే భవిష్యత్తు

తిరుపతి రూరల్ : ఆధునిక భారత దేశంలో క్వాంటమ్ టెక్నాలజీ ప్రధాన భూమిక పోషిస్తుందని వీసీ ఉమ తెలిపారు. పద్మావతి వర్సిటీలో అమరావతి క్వాంటమ్ వ్యాలీ హాకథాన్-2025లో భాగంగా గురువారం జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. క్వాంటం టెక్నాలజీ భవిష్యత్తులో కీలక పాత్ర పోషిస్తాయని, అవి సిలికాన్ వ్యాలీలా మార్పు తీసుకొస్తాయని వివరించారు. క్వాంటం వ్యాలీ, గ్లోబల్ సమస్యలను పరిష్కరించగల వ్యూహాత్మక అడుగు అని అభివర్ణించారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ప్రొఫెసర్ రజిని, ప్రొఫెసర్ అంజన్ బాబు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు

దుబాయి దినార్లు ఇస్తానని టోకరా

రూ.5లక్షలు కాజేసిన కేటుగాడు

చంద్రగిరి: తక్కువ ధరకు దుబాయి దినార్లు ఇస్తానని చెప్పి ఓ వ్యక్తి రూ.5లక్షలను కాజేసిన ఘటన బుధవారం చంద్రగిరిలో చోటుచేసుకంది. పీలేరుకు చెందిన సలీం బాషా పీలేరులో అగరబత్తీల వ్యాపారం చేస్తున్నాడు. కొద్ది రోజుల క్రితం ఓ వ్యక్తి సలీం బాషా దుకాణం వద్దకు వెళ్లాడు. తన వద్ద దుబాయి దినార్లు ఉన్నాయని, తక్కువ ధరకు ఇస్తానని, కావాలంటే ఒక దినార్ ఇస్తాను పరిశీలించుకోమని నమ్మబలికాడు. అత్యాసకు పోయిన సలీం బాషా ఆ వ్యక్తి మాటలను నమ్మి, ఫోన్‌లో తరచూ మాట్లాడుతూ వస్తున్నాడు. ఈ క్రమంలో తనకు రూ.5లక్షలకు దినార్లు కావాలని సలీం బాషా ఫోన్‌లో కోరాడు. దీంతో గురువారం చంద్రగిరి లైబ్రరీ వద్దకు నగదుతో వస్తే రూ.5లక్షలకు దినార్లను అందిస్తానని గుర్తు తెలియని వ్యక్తి చెప్పాడు. అలాగే పీలేరు నుంచి చంద్రగిరికి చేరుకున్న సలీం బాషా ఆ వ్యక్తికి రూ.5లక్షల నగదును అందించాడు. తిరిగి ఆ వ్యక్తి ఓ బ్యాగును ఇచ్చాడు. ఆ బ్యాగును ఇక్కడ తెరవకుండా ఇంటికి తీసుకెళ్లి చూసుకోవాలని తెలిపి వెళ్లిపోయాడు. కొంత సేపటికి బ్యాగును తెరిచి చూడగా అందులో న్యూస్ పేపర్లు ఉండడంతో తాను మోసపోయానని గ్రహించి పోలీసులను ఆశ్రయించాడు. దీంతో పోలీసులు వెంటనే మోసం చేసిన వ్యక్తి ఫోన్‌కు ఫోన్ చేయగా.. స్విచ్ ఆఫ్ చేసి ఉంది. ఘటన స్థలానికి వెళ్లి పరిసరాల్లో సీసీ కెమెరాలను పరిశీలించినా ఏమీ లభ్యం కాలేదు. దీంతో తన నగదు ఎక్కడ ఇచ్చాడో సరైన వివరాలు చెప్పాలని పోలీసులు సలీం బాషా సూచించారు. కనీసం సీసీ కెమెరాల ఫుటేజీ ఉంటే తీసుకురావాలని సలహా ఇచ్చారు. అయితే ఈ ఘటనపై పోలీసులు విచారణ చేస్తున్నారు.

గంజాయి ముఠా అరెస్టు

- 11.5 కిలోల గంజాయి పట్టివేత
- యువత, విద్యార్థులే లక్ష్యంగా గంజాయి సరాఫరా



గంజాయి ముఠా వివరాలను వెల్లడిస్తున్న డీఎస్పీ చెంచుబాబు

నాయుడుపేటటౌన్ : నాయుడుపేట కేంద్రంగా గంజాయి విక్రయాలు జరిపే ముఠాకు సంబంధించి ఆరుగురిని అరెస్టు చేసినట్లు డీఎస్పీ చెంచుబాబు బుధవారం వెల్లడించారు. పోలీస్ డివిజన్ కార్యాలయంలో బుధవారం విలేకరుల సమావేశంలో డీఎస్పీ వివరాలను వెల్లడించారు. 26వ తేదీన ఎస్ఐ ఆదిలక్ష్మి పోలీసులతో పాటు తహసీల్దారు రాజేంద్ర, వీఆర్వోలతో కలిసి మండల పరిధిలోని శ్రీనివాసపురం సమీపంలో అటవీ ప్రాంతంలో సోదాలు జరిపారు. అక్కడ గంజాయి ప్యాకెట్‌లతో ఉన్న ఆరుగురిని పట్టుకున్నారు. పట్టుబడిన వారిలో నాయుడుపేట పట్టణంలోని బేరిపేటకు చెందిన కలపాటి జాన్ బ్లెస్సన్, ఎన్ఎస్ఆర్ కాలనీకి చెందిన కంట్లం వినోద్, అరవ సెల్వం, మూలయలకోటకు చెందిన ఐజక్ రాకేష్ అలియాస్ రాకీ, వెంకటేశ్వరపురం ప్రాంతానికి చెందిన రెడ్డి హర్షవర్ధన్, గూడూరు పట్టణంలోని మధురెడ్డి కాలనీలో నివాసం ఉంటున్న ఆకుల శ్రీకాంత్‌గా పోలీసులు గుర్తించారు. ప్రధాన నిందితుడైన జాన్ బ్లెస్సన్ కొంత మందితో కలిసి ముఠాగా ఏర్పడి రాజమండ్రి నుంచి నాయుడుపేటకు గంజాయి తెప్పించుకుని విక్రయాలు జరుపుతున్నట్లు గుర్తించామన్నారు. సుమారు రూ. 3 లక్షలకు పైగా విలువ చేసే 11.5 కిలోల గంజాయితో పట్టుబడిన ఆరుగురిని అరెస్టు చేసి కోర్టుకు హాజరు పరిచి రిమాండ్‌కు పంపినట్లు వివరించారు. వారి వద్ద నుంచి రెండు బైక్‌లు, నాలుగు సెల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. గంజాయి ముఠా గుట్టు రట్టు చేసిన సీఐ బాబీ, ఎస్ఐ ఆదిలక్ష్మి, హెడ్ కానిస్టేబుళ్లు ఆర్‌వీ రాజు, రామ్మోహన్ రాజు, కానిస్టేబుళ్లను డీఎస్పీ నగదు రివార్డులను అందించి అభినందించారు.

పోక్సో కేసులో సంచలన తీర్పు

నెల్లూరు (లీగల్)/చిల్లకూరు : బాలికను ఇంటి నుంచి బలవంతంగా తీసుకెళ్లి లైంగిక దాడికి పాల్పడ్డారని నమోదైన కేసులో నేరం రుజువు కావడంతో చిల్లకూరు మండలం తీపనూరుకు చెందిన నిందితుడు కన్నా శ్రీనివాసులుకు 20 ఏళ్ల జైలుతో పాటు రూ.20 వేల జరిమానా విధిస్తూ నెల్లూరు ప్రత్యేక పోక్సో కోర్టు న్యాయమూర్తి సిరిపిరెడ్డి సుమ గురువారం తీర్పుచెప్పారు. ప్రాసిక్యూషన్ కథనం మేరకు.. చిల్లకూరు మండలం తీపనూరుకు చెందిన 17 ఏళ్ల బాలిక తన తల్లిదండ్రులతో ఉంటూ చదువుకొనేది. నాయుడుపేటలోని తెల్వాయిపాడులో తెలిసిన వారి ఇంటికి 2021 జూలై 14న బాలిక తల్లిదండ్రులు వెళ్లారు. తిరిగి అదే రోజు సాయంత్రం ఇంటికొచ్చి చూడగా, బాలిక కనపడలేదు. చుట్టుపక్కల విచారించిన అనంతరం జూలై 17న చిల్లకూరు పోలీసులకు బాలిక తల్లి ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు అనంతరం శ్రీనివాసులుపై కోర్టులో చార్జిషీట్‌ను దాఖలు చేశారు. విచారణలో నేరం రుజువు కావడంతో పైమేరకు శిక్ష, జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారు ప్రాసిక్యూషన్ తరఫున స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ దూబిశెట్టి చంద్రశేఖర్ వాదించారు.

ముక్కంటి ఆలయంలో చోరీ

- టికెట్ కౌంటర్‌ను బద్దలు కొట్టి నగదు అపహరణ
- మూడంచెల భద్రత ఉన్నా ఆలయంలోకి ప్రవేశం



శ్రీకాళహస్తి ఆలయంలోని ఇండియన్ బ్యాంకు కౌంటర్

శ్రీకాళహస్తి : శ్రీకాళహస్తీశ్వరాలయంలో మంగళవారం రాత్రి ఆలయం మూసిన తర్వాత టికెట్ కౌంటర్‌లో నగదు చోరీ జరిగింది. శ్రీకాళహస్తి ఆలయంలో మంగళవారం రాత్రి ఆలయం మూసిన తర్వాత ఓ దొంగ ప్లాట్‌ఫాంపై నుంచి బాలాజ్ఞానాంబిక ఆలయం వద్ద ఉన్న రూ.50 టిక్కెట్ కౌంటర్ వద్దకు చేరుకుని కౌంటర్‌ను బద్దలుకొట్టి చోరీకి పాల్పడ్డాడు. బుధవారం కౌంటర్ సిబ్బంది రూ.5,800 దొంగతనం జరిగినట్లు గుర్తించారు. ఆ సమాచారం ఈవో బాపిరెడ్డికి తెలియజేశారు. దీనిపై 1వ పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసుల సీసీ కెమెరాల ఆధారంగా దర్యాప్తు చేస్తున్నారు.

ఆలయంలో భద్రతా డొల్లతనం

మూడంచెల భద్రత, 16 మంది సీఆర్‌పీఎఫ్ సిబ్బంది, సీఆర్‌పీలు, హోంగార్డులు, సెక్యూరిటీ ఉండే శ్రీకాళహస్తి ఆలయంలో దొంగతనం జరగడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. గేట్లు మూసేసిన తరువాత దొంగ ఎలా ప్రవేశించాడు. సీసీ కెమెరాల నిఘా ఏమైంది.? భద్రతా బలగాలు ఏం చేస్తున్నట్లు ?అనే ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. గతంలో కూడా ఓ వ్యక్తి ప్రాకారంపై నుంచి లోపలికి దిగితే అతడికి మతిస్థిమితం లేదని ఆ విషయాన్ని కొట్టిపడేశారు. ఇప్పుడు ప్రాకారం నుంచి లోపలికి దిగి ఇండియన్ బ్యాంకు కౌంటర్‌లో స్వయంగా దొంగతనం జరిగితే గుర్తించలేకపోవడంపై ఆలయంలోని భద్రత వైఫల్యంపై భక్తులు విస్తుపోతున్నారు.

23 కిలోల గంజాయి పట్టివేత

సాక్షి టాస్క్‌ఫోర్సు : గూడూరు ఒకటో పట్టణ పోలీసులు మంగళవారం సుమారు 23 కిలోల గంజాయిని తరలిస్తున్న రౌడీ షీటర్ జెమినీతో పాటు, అతడి స్నేహితుడి కాలేషాను కోర్టుకు హాజరు పరిచినట్లు గురువారం ఆలస్యంగా వెలుగు చూసింది. గూడూరు కేంద్రంగా ఇటీవల చోటు చేసుకుంటున్న పలు సంఘటనలు ప్రజల్లో భయాందోళనలు రేకెత్తిస్తున్నాయి. ఇటీవల నెల్లూరు జిల్లా కేంద్రంలోని జైలులో జీవిత ఖైదు అనుభవిస్తున్న రౌడీ షీటర్ శ్రీకాంత్ పెరోల్ విషయం వెలుగు చూడడం, దీనికి స్థానికంగా ఉన్న బడా నేతలు పలువురు సహకారం అందించారనే విషయం తేటతెల్లం కావడంతో ఒక్కసారిగా గూడూరు పట్టణం ఉలిక్కిపడింది. ఈ క్రమంలో వినాయక చవితి పండుగ సందర్భంగా విక్రయాలు బాగా ఉంటాయని జెమినీ తన అనుచరుల ద్వారా సుమారు 23 కిలోల గంజాయిని ఒడిశా నుంచి రైలులో తెప్పించగా జెమినీతో పాటు గంజాయి, అతడి స్నేహితుడు కాలేషాను పట్టుకుని అరెస్టు చేసి కోర్టుకు హాజరు పరిచినట్లు తెలిసింది. పట్టుబడిన గంజాయి విలువ సుమారు రూ.2.30 లక్షలు ఉండవచ్చని అంచనా.

సాక్షి క్లాసిఫైడ్స్

Real Estate

HOUSE FOR SALE

రేణిగుంట రాజరాజేశ్వరి నగర్‌లో 300 గజాల్లో ఉన్న 4 ఫ్లోర్ల 9000 అడుగుల బిల్డింగ్ అమ్మబడును. సంప్రదించండి ✆ 94402 64527

BUSINESS SERVICE

BUSINESS OFFER

We are Ready to Invest to Develop Your Business. We also Welcome Agent., Good Commission for Agents call 90926 92403

PERSONAL CARE

CHANGE OF NAME

I, C M Rathnam S/o Late. Chinnappa R/o at 9-50, Agraharam Dinne, Balla, Ramakuppam, Mandalam, Balla, Chittoor, Andhra Pradesh - 517425, Declares That My Name Has Been Wrongly Mentioned as Chinnappa Muni Rathanam in My Pension Certificate. The Actual Name is C M Rathnam. Respectively, Which May Be Amended Accordingly for All Future Purposes

Wanted

ప్రముఖ కంపెనీ నందు Work చేయుటకు సెక్యూరిటీ స్టాఫ్ (Male) & పాంట్రీ (Female) కావలెను. Salary upto 15000/-, Experience: 1 Year. Contact Cell: 73068 12727.

Teachers for Nursery, LKG, PET & Higher English, P.S. Contact: Chaitanya Bharathi High School, Bairagi Patteda North, Tirupathi. Cell: 98490 92981.

తిరుపతిలో ప్రముఖ హాస్పిటల్ నందు పనిచేయుటకు ఫార్మ-D (Female) కావలెను. అనుభవం ఉన్న వారికి ప్రాధాన్యత. సంప్రదించండి: 9246999901.

తిరుపతిలోని ప్రముఖ రియల్ ఎస్టేట్ సంస్థకు 5-10 సం.లు అనుభవం, కంప్యూటర్ పరిజ్ఞానం గల 1) ఆఫీస్ మేనేజర్ (మగ వివాహితుడు). 2) రీసెంట్‌గా రిటైర్ అయిన సర్వేయర్. 3) ఆఫీసు ఎగ్జిక్యూటివ్ (వివాహిత) కావలెను. ఆకర్షణీయమైన జీతం. ✆ 96760 22100.

తిరుపతిలో ప్రముఖ కన్‌స్ట్రక్షన్ కంపెనీలో పనిచేయుటకు Junior Accountant, సెక్యూరిటీ గార్డ్స్, డ్రైవర్స్ కావలెను. సంప్ర: 9741163131, 9676329827.

ఓం సువదం హాస్పిటల్, తిరుపతి లో పనిచేయుటకు హౌస్ కీపింగ్ సూపర్‌వైజర్స్,హౌస్ కీపింగ్ స్టాఫ్, సెక్యూరిటీ గార్డ్స్ కావలెను. ✆ 77027 00244.

Urgent Hiring Looking for Domestic IT Recruiters, Any Graduates with good communication skills are preffered, Freshers also can apply. 8712345519.

Wanted Lady Doctor. Qualification; MBBS/BHMS/BAMS with 1-2 Years Experience in Gynaecology. Contact: Dr.S.Andal Bhaskar, Near S2 Cinema Theatres, Pogathota, Nellore. Ph: 99088 54316. 0861-2328914.

గూడూరు (రాజోయే) జిల్లా పరిసరాల్లో అంకెలు 35K నుండి 1.5 L వరకు గల ప్లాట్స్‌ను మార్కెటింగ్ చేయుటకు రియల్ ఎస్టేట్ ఏజెంట్స్, ప్రభుత్వ / ప్రైవేట్ ఉపాధ్యాయులు, గృహిణులు, నెట్‌వర్క్ మార్కెటింగ్ నాయకుల మార్కెటింగ్ బృందం కావలెను. సంప్ర :: 76708 90977.

నాలుగులైన్ల ప్రకటనకు : రూ. 375/- అదనపు లైనుకు : రూ . 90/- ప్రతి ప్రకటనపై G.S.T 5% అదనం

Contact 9705444178 9951602970

గమనిక

